ప్రజాశక్తి
సోమవారం 12 ఆగస్టు 2024
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు






17న ఉపరాష్ట్రపతి రాక

ప్రజాశక్తి-నెల్లూరు

ఈనెల 17న భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ జిల్లాలో పర్యటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదివారం ప్రకటనలో తెలిపారు.17 వ తేది ఉదయం 8:35 కు శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 9:40 కు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారన్నారు. అక్కడి నుండి 9:50 కు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా బయలుదేరి 10:30 కు నెల్లూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు చేరుకుంటారన్నారు. అక్కడనుండి రోడ్డు మార్గం ద్వారా 10:50 కు వెంకటాచలంలోని అక్షర విద్యాలయానికి చేరుకుంటారన్నారు. అక్షర విద్యాలయం, స్వర్ణ భారత్ ట్రస్ట్ లలో ఏర్పాటుచేసిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. అనంతరం మధ్యాహ్నం 2.55 కు తిరిగి పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి బయలుదేరి రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారన్నారు.



జగదీప్ ధన్‌ఖడ్, ఉపరాష్ట్రపతి

పూడిక తీశారు.. మూతలు మరిచారు..!

కందుకూరులో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్ - అవస్థలుపడుతున్న జనం

ప్రజాశక్తి- కందుకూరు : కందుకూరు పట్టణంలోని మురుగు కాలవల్లో పూడికలు తీయడానికి మున్సిపల్ అధికారులు ఇటీవల చర్యలు చేపట్టారు. మరుగు కాలువల్లోని పూడిక తీయడానికి కాంట్రాక్టర్‌కు పనులు అప్పజెప్పారు. కాంట్రాక్టర్ కాలువల్లోని పూడికి తీయడానికి పూనుకున్నారు. మురుగు కాలువలపై ఉన్న మ్యాన్ హోల్ పైన ఉన్న మూతలను తొలగించి పూడిక తీయించారు. కొన్నిచోట్ల మ్యాన్‌హోల్‌పై ఉన్న మూతలు రాకపోవడంతో పగులగొట్టారు. పూడికతీత పనులు పూర్తయిన తర్వాత వాటిపై మూతలు వేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా పొట్టి శ్రీరాములు బొమ్మ వద్ద నుంచి సురేష్ రెడ్డి చికెన్ సెంటర్ వరకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఉంది. దానిపై ఉన్న మూతలను తొలగించారు. తిరిగి మూతలు వేయకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మూతలు వేసే పని కాంట్రాక్టర్ చేత చేయిస్తారా లేక మున్సిపల్ అధికారులు ఇతరుల చేత వేయిస్తారో అర్థం కావడంలేదు.. కాంట్రాక్టర్ పూడికతీతతోనే తన పని అయిపోయిందని మిన్నకుండిపోయారు. కాలువలపై మూతలు వేయక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని షాపుల యజమానులు, గృహిణులు గత్యంతరం లేక వారే సొంతంగా వేసుకుంటున్నారు. ఆ మూతలు ఎవరు వేస్తారో అర్థంకాక ప్రజలు ఎదుర్కొంటున్నారు.



ప్రమాదభరితంగా ఉన్న మ్యాన్ హోల్

మహనీయుడు సీతారామిరెడ్డి

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ప్రజాశక్తి-నెల్లూరు : మునునూరు వారి పాలెం పల్లి కాపుల భూ సమస్యల పైన అనేక పోరాటాలు చేసి 84 ఎకరాల భూమిని సాధించిన మహనీయుడు సీతారామిరెడ్డి అని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. ఆదివారం ముసు నూరు వారిపాళెంలో మునుకూరు సీతారా మిరెడ్డి విగ్రహాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఆవిష్కరించారు. ముందుగా సిపిఎం జెండాను ఆ పార్టీ సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్ ఆవిష్కరిం చారు. సిఐటియు జెండాను గడ్డం అంకయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మూలం రమేష్ మాట్లాడుతూ సిపిఎం ఆధ్వర్యంలో 1979లో అనేక భూ పోరాటాల్లో సీతారామిరెడ్డి పాల్గొని పేద ప్రజలకు భూములను పంపిణీ చేయడంలో కీలక భూమిక పోషిం చారన్నారు. అటువంటి చరిత్ర కలిగిన వ్యక్తి విగ్రహా విష్కరణ చేయడం సంతోషకరమన్నారు. 1979లో జిల్లాలో ఆయన ఆధ్వర్యంలో చేపట్టిన భూ పోరాటాలు సాధించిన విజయాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, గోగుల శ్రీ నివాసులు, మునుకూరుసీతారామి రెడ్డి అన్న కుమారుడు మునుకూరు రవికుమార్ రెడ్డి బాబిరెడ్డి),మునుకూరు సీతారామి రెడ్డి కొడుకు కుమార్తె మునునూరు నిఖిల, వారి కుటుంబ సభ్యులు స్థానిక గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



జెండా ఆవిష్కరిస్తున్న సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్



సీతారామిరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

వయనాడ్ బాధితుల కోసం

సిపిఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరణ

ప్రజాశక్తి -నెల్లూరు : సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో 32 వ డివిజన్ పరిధిలో వయ నాడ్ వరద బాధి తులకు ఆర్థిక సహాయం చేసేందుకు విరాళాల సేకరణ చేపట్టారు. ఆదివారం డైకాస్ రోడ్ సెంటర్ లో షాపులు, అంగళ్లు టీ దుకాణాలలో ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కష్ణయ్య మాట్లాడుతూ కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండ చరియలు విరిగిపడి ఊర్లకు ఊర్లే కొట్టుకపోయాయన్నారు. 400 మంది పైగా మృతి చెందారన్నారు. ఇంకా అనేకమంది వరదల్లో చిక్కుకున్నారన్నారు. వందలాది మంది క్షతగాత్రులై ఆస్పత్రుల పాలయ్యారన్నారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారన్నారు. వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు.అనేకమంది వ్యక్తులు, సంస్థలు, ప్రజలు తమ వంతు సహకారం అందిస్తున్నారనాన్రు. వయనాడ్ విపత్తును కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఆగస్టు 10న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏరియల్ సర్వే చేపట్టి వట్టి మాటలతో తిరిగి వెళ్లారన్నారు. జాతీయ విపత్తుగా ప్రకటించేది మరిచి పోయారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కేరళ ప్రభుత్వంపై వివక్షను విడనాడి వయనాడ్ బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విరాళాల సేకరణలో సిపిఎం రూరల్ కార్యదర్శివర్గ సభ్యులు కొండ ప్రసాద్ ,రూరల్ కమిటీ సభ్యులుఎస్ కే. ఖలీల్, ఎం .సుధాకర్, ఎస్.కె షంషాద్, ఆటో యూనియన్ నాయకులు కామ్రేడ్, ఎస్కే. షా న్వాజ్, ు సిహెచ్ రమణ య్య, ఎస్.కె ఫజల్, ఎస్.కె బాజావలి, ఎం. పెంచలయ్య, డివైఎఫ్ఐ నాయకులు ఎస్.కె. ఎగ్బాల్,, సంధాని పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న దృశ్యం

జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో

13న చిత్రలేఖనం..దేశభక్తి పాటల పోటీలు

ప్రజాశక్తి-నెల్లూరు : ఈ నెల 13న ముందస్తు స్వాతంత్రది నోత్సవ వేడకలు డాక్టరు జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఆ కేంద్రం సాంస్కృతిక రంగం కన్వీనర్ ఎం.పుల్లయ్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని డాక్టరు జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వేడుకలకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎం.పుల్లయ్య మాట్లాడుతూ 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు మంగళవారం డాక్టరు జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో విద్యార్థులకు చిత్రలేఖనం దేశభక్తి పాటల పోటీలు నిర్వహిస్తుందన్నారు. 6,7 తరగతి విద్యార్థులకు జూనియర్ విభాగంలో, 8,9,10 తరగతి విద్యార్థులకు సీనియర్ విభాగంలో చిత్రలేఖనం, దేశభక్తి పాటల పోటీలు విడివిడిగా మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు శాస్త్రీయ నృత్య నీరాజన కార్యక్రమం (సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించి ఈ పోటీలలో ప్రతిభను కనపరిచిన విద్యార్థులకు సాయంత్రం 6 గంటలకు జరిగే కార్యక్రమంలో బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. ఈ ముగింపు కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి వి.జె.రామారావు ముఖ్యఅతిథిగా హాజరై గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారన్నారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమానికి చివరగా సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. జెఎస్ ట్రస్ట్ నిర్వహణ కమిటీ కన్వీనర్ ఆర్ నగేష్, కె జయరాం రెడ్డి, పీవీ నరసింహారెడ్డి పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు

హెల్త్ సెక్రటరీ మృతి బాధాకరం

ప్రజాశక్తి-నెల్లూరు : కొండాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సచివాలయం హెల్త్ సెక్రటరీగా సేవలందిదస్తున్న ఉమామహేశ్వరి మృతి చెందడం బాధాకరం అని ఎపి హంస జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్‌రావు అన్నారు. ఆదివారం ఆయన ఆయన మాట్లాడారు. విధినిర్వహణలో అందరి మన్ననలు పొందిన ఉమామహేశ్వరి చిన్న వయసులోనే అనారోగ్య కారణాలతో తుది శ్వాస విడవడం విస్మయానికి గురిచేసిందన్నారు. మృతురాలు ఉమా మహేశ్వరి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎపి హంస జిల్లా జనరల్ సెక్రెటరీ కమల్ కిరణ్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఉమామహేశ్వరి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని బెనిఫిట్స్ అందేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్‌పి దామోదర్‌ను కలిసిన మోషే

ప్రజాశక్తి-కందుకూరు : ప్రకాశం జిల్లా ఎస్‌పి ఎ ఆర్ దామోదర్‌ను ఒంగోలు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన ఎస్‌పికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



ఎస్‌పికి శుభాకాంక్షలు తెలుపుతున్న మోషే



మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న మంత్రి ఆనం

మంత్రి 'ఆనం' బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి : వెలగపూడి సచివాలయంలోని రెండో బిల్డింగులోని ఆంధ్ర రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఛాంబర్‌లో ఆదివారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు. ఆనం రామనారాయణరెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 160 దేవాలయాల పునర్‌నిర్మాణ ఫైల్‌పై తొలి సంతకం చేశారు. అబ్దుల్ జలీల్, ఆనం రామనారాయణరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి అధ్వానం..

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని సోమశిల గ్రామంలోని సుబ్రహ్మణ్యం స్వామి రహదారి అధ్వానంగా ఉందని, దాంతో భక్తులు, పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం రహదారులపై ప్రత్యేక దృష్టి పెట్టకపోవడంతో అధ్వానంగా తయారైంది. ఈ రహదారిలో రోడ్డు వేసి 30 ఏళ్లు అవుతుంది. ఈ రహదారి నుంచే ప్రాజెక్టుపైకి అధికారులు, ప్రజా ప్రతినిధులు వెళుతుంటారు. ఈ రోడ్డు అధ్వాన పరిస్థితి చూసి కూడా అధికారులు చెప్పకపోవడం విమర్శలకు తావిస్తున్నాయి. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి ఉన్నందున ఆత్మకూరు ఎంఎల్‌ఎగా ఆనం రామనారాయణ రెడ్డి గెలుపొంది దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మంత్రి రహదారిపై శ్రద్ధ వహించి ప్రత్యేక నిధులతో అధ్వానంగా ఉన్న రహదారిని బాగు చేయాలని మండల, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఎంఎల్‌ఎ 'ఇంటూరి'కి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కందుకూరు

రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి తరుపున కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎంఎల్‌ఎగా ఇంటూరి నాగేశ్వరరావు 18518 ఓట్ల ఆధిక్యంతో అఖండ విజయం సాధించిన శుభసందర్భంగా బడేవారిపాలెం గ్రామంలోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో నలదలపూరు గ్రామ ఎస్సీ నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపినట్లు కందుకూరు నియోజకవర్గ ఎస్‌సి సెల్ కార్యదర్శి దువ్వూరి రమేష్ చంద్ర తెలిపారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నలదల పూరు గ్రామంలోని ఎస్సీ కాలనీ అభివద్ధికి తోడ్పాటును అందిస్తానన్నారు. ఆర్థికంగా , రాజకీయంగా , సామాజికంగా ప్రాధాన్యత కల్పిస్తానని వారికి భరోసా ఇచ్చినట్లు రమేష్ చంద్ర తెలిపారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో దువ్వూరి దొరబాబు , దువ్వూరి బాబురావు , దువ్వూరి జాన్ , కుడుముల పేతురు , దువ్వూరి శ్రీను , దువ్వూరి సురేష్ , గౌడపేరు ఆందోని , దువ్వూరి ఆంటోని , దువ్వూరి బాబురావు , దువ్వూరి వంశి , దువ్వూరి చిన్న కోటయ్య , దువ్వూరి పాపారావు ఉన్నారు.



ఎంఎల్‌ఎ ఇంటూరికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం



విజయభాస్కర్‌రావుకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

ఇన్‌ఛార్జి ఉపకులపతికి అభినందనలు

ప్రజాశక్తి -వెంకటాచలం

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి ఉపకులపతిగా నియామకమైన ఆచార్య విజయభాస్కర రావును న్యాయవాది, జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకులు దాసరి ప్రసాద్ గౌడ్ నెల్లూరులోని ఉపకులపతి క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయేటువంటి రోజుల్లో విశ్వ విద్యాలయంతో కలిసి జనతా ఫౌండేషన్ ద్వారా న్యాయపరమైనటువంటి అంశాలలో తమ వంతు సహ కారాన్ని అందిస్తామని తెలిపారు. నెల్లూరు జిల్లాలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయానికి పరిశోధన రంగంలో మంచి పేరు ప్రఖ్యాతలు గడించిన విజయ భాస్కరరావును ఉపకులపతిగా నియమించినందుకు ప్రభుత్వానికి ఆయన ధన్యవా దాలు తెలిపారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రావుకు అభినందనలు తెలిపారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పర్చూరు నారాయణ గౌడ్ పాల్గొన్నారు.


విశ్రాంత ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ శాస్త్రి మృతి

పలువురు సంతాపం

ప్రజాశక్తి-నెల్లూరు

విశ్రాంత ఉపాధ్యాయులు మల్లాది లక్ష్మీనారాయణ శాస్త్రి (101) వయోభారం.. అనారోగ్యం కారణంగా శనివారం తుది శ్వాస విడిచారు. వద్ధాప్యం కారణంగా ఆయన నెల్లూరులోని ఆయన సోదరుడి కుమారుడు, ప్రముఖ హోమియో వైద్యులు ఎంఎస్ఎస్ శర్మ వద్ద ఉంటున్నారు. లక్ష్మీనారాయణ శాస్త్రి భౌతికకాయానికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు.

నిబద్ధతతో ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగిన లక్ష్మీనారాయణశాస్త్రి బాపట్ల జిల్లా, పర్చూరు ప్రాంత ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. ఉపాధ్యాయు వృత్తిలో ఉన్న ఆయన వైఆర్ హైస్కూల్లో విద్యార్థులను తన బాణీలో తీర్చిదిద్దారు. ఆయన శిక్షణలో అనేకమంది వివిధ శాఖల్లో ఉన్నత ఉద్యోగులుగా రాణించారు. మరికొంత మంది వివిధ రంగాల్లో ఉన్నత స్థితిలో స్థిరపడ్డారు. విద్యాబోధనేకాక ఆయన పర్చూరులో అనేక అభివద్ధి , సాంస్కతిక కార్యక్రమాలు చేపట్టారు. ఆయన ఉచితంగా హోమియో వైద్యం చేసేవారు.గ్రామస్తులు ఇతర గ్రామాల వారి సహకారంతో త్యాగరాజ స్వామి వారి ఉత్సవాలు పర్చూరులో ఘనంగా నిర్వహించారు. స్వర్ణోత్సవాల సందర్భంగా జాతీయ స్థాయి కళాకారులను పర్చూరు తీసుకొచ్చి సంగీత కచేరీలు నిర్వహించారు. మంచి సంగీతాన్ని ప్రజలకు వినిపించారు. పర్చూరు పరిసర గ్రామాల్లోని అనేకమంది విద్యార్థులు ఆయన వద్దనే చదువుకుని మంచి ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారు. అనేక విద్యాసంస్థలు, సంగీత సంస్థలు, దేవాలయాలకు సాయం అందించారు. పేద విద్యార్థులకు తన వంతు ఆర్థిక చేయూత నిచ్చారు. లక్ష్మీనారాయణ శాస్త్రి మృతికి మాజీ టెలికం జి ఎం ఐ యశోద ప్రసాదు, ప్రముఖ చిత్రకారుడు లంకా ప్రసాద్, కొల్లా సుబ్బారావు, న్యాయ నిర్ణీత కారుమూడి సీతారా మయ్య ఒంగోలు త్యాగరాజ మందిర నిర్వాహకులు పి రాంబాబు, చీరాల చైతన్య భారతి సాంస్కతిక సంస్థ కార్యదర్శి భాగి నారాయణ శాస్త్రి పి వివిఎస్ ప్రసాద్,కొల్లా సుబ్బారావు కె .రామకోటేశ్వరరావు తదితరులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.



లక్ష్మీనారాయణ శాస్త్రి



కార్యకర్తలు, నాయకులతో భేటి అయిన బుర్రా మధుసూదన్ యాదవ్

'బుర్రా'తో వైసిపి నాయకుల భేటి

ప్రజాశక్తి - -కందుకూరు : కందుకూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదివారం స్థానిక కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో భేటి అయ్యారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు నియోజ కవర్గంలో ఎదురవుతున్న సమస్యలను మధుసూదన్ యాదవ్ దష్టికి తీసుకెళ్లారు. ఆయన వారికి పలు సూచనలు చేశారు. నాయకులు ,కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గత మూడు రోజులుగా ఆయన కందుకూరులో ఉండి కార్యకర్తల సమస్యలు తెలుసుకుంటున్నారు. వారికి భరోసానిస్తున్నారు.

కోర్టు ఆదేశాలు బేఖాతర్..!

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ విషయంలో మోసం చేసిన ఓ లైసెన్సెడ్ సంస్థపై కేసు నమోదు చేయాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలను పోలీసులు బేఖాతర్ చేశారు. వివరాల మేరకు విజయవాడ రైల్వే శాఖలో టెక్నీ షియన్ గా పనిచేస్తున్న యరగర్ల వాసు భవన నిర్మాణం కోసం అవసమైన ప్లాన్ అప్రూవల్ కోసం మండలంలోని నరుకూరు గ్రామానికి చెందిన నుడా లైసె న్స్‌డ కెకెఆర్ ప్రాజెక్టు నిర్వాహకుడు పాకం కిరణ్ కుమార్ వద్ద 10.03. 2022న దరఖాస్తు చేశారు. ఇంటి స్థలం డాకుమెంట్స్ ప్లాన్ అప్రూవల్ కోసం ఎన్‌ఎంసికి చెలించాల్సిన ఫీజు రూ.1,42,653 కిరణ్‌కుమార్‌కు చెల్లించారు.

అయితే కిరణ్ కుమార్ బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ చేయకపోగా పత్తా లేకుండా పోయాడు. ఈ నేపథ్యంలో బాధితుడు యరగర్ల వాసు కోర్టును ఆశ్ర యించాడు. వాసును మోసగించిన కెకెఆర్ ప్రాజెక్టు నిర్వాహకుడు కిరణ్ కుమార్‌పై కేసు నమోదు చేయాలని ఈ ఏడాది జులై 24న కోర్టు నెల్లూరు 5వ పట్టణ పోలీసులను ఆదేశించింది. అయితే నేటి వరకు కెకెఆర్ ప్రాజెక్టుపై పోలీసులు కేసు నమోదు చేయకోవడం గమనార్హం.



రైతులకు ప్రధాని సందేశం

ప్రజాశక్తి-మర్రిపాడు

ప్రధాని నరేంద్ర మోడీ బయో ఫోర్టిఫైడ్, వాతావరణ స్థితిస్థాపకత రకాలను దాదాపుగా 109 పంట రకాలను భారత వ్యవసాయ పరిశోధన మండలి హెడ్ క్వార్టర్స్ ఢిల్లీలో ఆదివారం జాతికి అంకితం చేశారని ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.ఎల్.శివజ్యోతి తెలిపారు. ప్రధాని సందేశాన్ని కృషి విజ్ఞాన కేంద్రం, నెల్లూరులో లైవ్ స్ట్రీమింగ్ ద్వారా రైతులకు చూపించారు. 109 రకాల వివరాలను అదేవిధంగా వాటి పంట స్థితిగతులను రైతులకు తెలియజేశారు. ఆచార్య ఎన్‌జి రంగా విశ్వ విద్యాలయం నుండి రెండు రకాలను జాతీయస్థాయిలో మోడీ విడుదల చేశారన్నారు. పప్పు గింజల్లో శనగలో ఎన్‌బిఇజి 1267, పెసరలో ఎల్ జిజి -610 రకాలను విడుదల చేశారని తెలిపారు. మొత్తం 109 రకాల ఆహార ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, పూల రకాలను భారత జాతికి అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో రబీ కాలంలో నెల్లూరుకు అనువైన వరీ, మినుము, శనగ, నువ్వులు రకాలను రైతులకు వివరించారు. రైతులు అందరూ ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి వ్యవసాయంలో వచ్చే పథకాలను, సబ్సిడీలు పొందాలని డాక్టర్ ఎస్.లోకేష్ బాబు కోరారు. వరి పంటలో సమగ్ర పోషక యాజమాన్యం గురించి డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి వివరించారు. వేరుశనగలో, నిమ్మలో విలువాధారిత పదార్థాలు మరియు తయారు చేసుకునే విధానం గురించి డాక్టర్ సుజాత వివరించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామీణ యువత, శాస్త్రవేత్తలు, కె వి కె సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని తెల్లపాడు గ్రామంలో ఆదివారం సీతారామాలయంలో జీర్ణోద్ధరణ పనుల అనంతరం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. నూతన ఆలయంలో సీతారామ విగ్రహాలతో పాటు లక్ష్మణ స్వామి ఆంజనేయస్వామి ఇలా విగ్రహాల సైతం ప్రతిష్ట చేశారు. ప్రధాన అర్చకులు యద్దనపూడి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో రిత్వికలు కావలికి చెందిన నరసింహ శాస్త్రీ తదితరులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నూతన విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం చేశారు. ఆలయ శిఖరంపై కలిసేస్తావన చేసి కుంభాభిషేకం చేశారు. మూలమూర్తులకు అభిషేకాలు చేసి అనంతరం అలంకరించారు. ప్రతిష్టానంతరం సీతారాముల కళ్యాణం ఆలయ మండపంలో నిర్వహించారు. వందలాదిమంది గ్రామ ప్రజలు వారి బంధువులు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయాన్ని సుందరంగా విద్యుత్ అలంకరణ చేశారు. ప్రతిష్టానంతరం మొదటగా గోదర్శనం కన్యాదర్శనం స్పటిక దర్శనం నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాలు మూడు రోజులపాటు నిర్వహించారు.

ఆలయాల్లో వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని విరువూరులో వెలసియున్న శ్రీ విజయాగణపతి, పోలేరమ్మ, చెంగాళమ్మ ఆలయాల తృతీయ వార్షికోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కత్తులపల్లి వంశస్తుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అభిషేకాలు, హోమాలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం నుంచి తప్పెట్లు, మేళతాళాతో బాణసంచాలు కాల్చుకుంటూ మహిళలు ఊరేగింపుగా నైవేథ్యాలను ఆలయానిక తీసుకొచ్చి అమ్మవార్లకు సమర్పించిన ఆలయ అర్చకులతో గోత్రనామాలతో పూజలు చేయించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు నిర్వహకులు సహబంతి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నిలిచిన రాయితీ పరికరాలు అందేనా..!

- స్వయంగా కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడుతున్న రైతులు
- కూటమి ప్రభుత్వంలో మళ్లీ అందజేస్తారని రైతులు ఎదురు చూపు

ప్రజాశక్తి-మర్రిపాడు



మెట్టప్రాంతం కావడంతో భూగర్భ జలాలు కూడా అంతంత మాత్రమే. ఈ నేపథ్యంలో బిందు సేద్యం ఎంతగానో ఉపయోగ పడుతుంది. డ్రిప్పు, స్ప్రింకర్లు ఉపయోగించడం ద్వారా అన్ని మొక్కల వేళ్ల దగ్గర గొట్టాల ద్వారా చుక్క నీరు పడుతుంది. దాంతో పొలమంత ఒకేసారి తడుస్తుంది. స్ప్రింకర్లు వాడటం వల్ల గొట్టాల ద్వారా నీటిని విరజిమ్ముతూ మొక్కలను తడుపుతుంది. నీటిని ఆదా చేసి లాభసాటి సేద్యానికి సూక్ష్మ సేద్య పరికరాలు ఎంతో దోహదపడతాయి. మండలంలో గత ప్రభుత్వ హయాంలో చాలామంది రైతులు బిందు సేద్యం వినియోగిస్తూ మిర్చి, ప్రత్తి, బొప్పాయి ఉద్యాన పంటలు పండిస్తూ అధిక దిగుబడులు సాధించే వారు. ఎక్కువమంది రైతులు బిందు తుంపర సేద్యం పరికరాలను ఏర్పాటు చేసుకుని తక్కువ నీటితో ఎక్కువ పంటలు సాగు చేసేందుకు ప్రభుత్వం రాయితీ పథకం అమలు చేసి రైతులను ప్రోత్సహించింది. అయితే ఐదేళ్ళ ప్రభుత్వం బిందు తుంపర సేద్యం పరికరాలు నిలిపివేయడంతో ఆ వసతి ఏర్పాటు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. దాంతో రైతులు పంటల సాగులో అష్టకష్టాలు పడుతున్నారు. రబీలో ఆరుతడి పంటలను సాగు చేయాలంటే బిందు తుంపర పరికరాలు అవసరం అని రైతులు చెప్పుకొచ్చారు. నీటి ఆదా తక్కువ వాలు బీడు భూములకు చాలా ఉపయోగకరం. అన్ని రకాల నేలలకు అనుకూలమైనది. నీటి ఆదా, తక్కువ విద్యుత్‌తో ఎక్కువ పొలానికి నీటి తడులు అందించవచ్చని రైతులు పేర్కొన్నారు. బిందు తుంపర సేద్య పరికరాలు అందుబాటులో లేకపోవడంతో నీరున్నా పంటలు పండించ లేక పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

90శాతం రాయితీ..

గతంలో ఐదు ఎకరాల లోపు విస్తీర్ణం కలిగిన ఎస్‌సి ఎస్‌టి రైతులకు 90శాతం రాయితీతో బిందు తుంపర సేద్య పరికరాలను ప్రభుత్వం సరఫరా చేసింది. రైతు భాగస్వామ్యంగా ఎపిఎంఐపికి చెల్లించాల్సి ఉంది. గత ప్రభుత్వం పరికరాల ఐదేళ్లుగా అందించలేదు. ప్రయివేటుగా సూక్ష్మ సేద్య పరికరాలు పెద్దలు కొనుగోలు చేయాలంటే రైతులు ఆర్థికంగా చితికి పోతున్నారు. రాయితీతో అందించిన పరికరాల వల్ల రైతులు బిందు సేద్యంతో ఖర్చు తక్కువ నీటి వృథా చేయకుండా పంటలకు తడులు ఇవ్వడం ద్వారా రైతులకు పని భారం తగ్గుతుంది. కూటమి ప్రభుత్వమైనా డ్రిప్పులు, స్ప్రింకర్లు అందిస్తుందని రైతులు ఎదురు చూస్తున్నారు.



యథేచ్ఛగా రోడ్లపై పశువుల సంచారం

- రెచ్చిపోతున్న గ్రామ సింహాలు, కోతులు - భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-ఉదయగిరి

పశువులు, వీధి కుక్కలు, కోతులతో పట్టణ ప్రజలు చిన్న పిల్లల తల్లులు గృహాల రోడ్లపై వెళ్లాలన్న విద్యార్థులు తల్లిదండ్రులు చిరు వ్యాపారులు భయాందోళన చెందుతున్నారు. పశువుల యాజమానులు పట్టించుకోకపోవడంతో యథేచ్ఛగా పశువులు రోడ్లపై తిరుగుతుండడంతో వాహనదారులు ప్రయాణికులు దుకాణదారుడు ఇబ్బందులు పడుతున్నారు. దాంతో తరచూ ట్రాఫిక్ కూడా అంతరాయం ఏర్పడుతోంది. గోవుల యజమానులు వాటిని పట్టించుకోకుండా రోడ్లపై వదిలి వేయడంతో ఈ దుస్థితి ఎదురవుతుందని పట్టణ ప్రజలు యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కొన్ని గోవులు పలువురిని వెంటాడి పొడిచిన సంఘటనలు ఉన్నాయి. దాంతో పాటు ఎక్కడబడితే అక్కడ గ్రామ సింహాలు గుంపులు గుంపులుగా చేరి చిన్నారులను విద్యార్థులను భయాందోళనకు గురి చేస్తున్నాయని చెబుతున్నారు. దీనికి తోడు కోతులు కూడా వ్యాపార పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామ సింహాలు, కోతుల బెడదకు చిన్నారులను స్కూళ్లకు పంపాలని ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న భయాందోళనతో స్కూలుకు పంపిస్తున్నామని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా మండల పంచాయతీ పాలకవర్గం చర్యలు తీసుకోవాలని అనేకమార్లు చెప్పిన ఫలితం లేదని వీటి నివారించడానికి జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ఏం జరుగుతుందో అని భయాందోళన చెందుతున్న పట్టణ ప్రజలకు విముక్తి కలిగించాలని కోరుతున్నారు.

'కుష్టు' రహిత సమాజానికి కృషి

ఎయిడ్స్ అండ్ లెప్రసీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ



ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రణాళికలు రూపొందించి, కుష్టు రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ఎయిడ్స్ అండ్ లెప్రసీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ తెలిపారు. గతంలో లెప్రసీ (కుష్టు) వ్యాధి అంటే ప్రజలు తీవ్ర భయాందోళనలకు లోనవుతుండేవారు. ఈ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించేందుకు ల్యాబ్‌లను ఆస్పత్రులల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతేడాది లాగా ఈ ఏడాది ప్రభుత్వం సూచనల మేరకు 'స్పర్శ' కార్యక్రమం పక్కా ప్రణాళిక ప్రకారం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిని వైద్య ఆరోగ్య సిబ్బంది సందర్శించి ప్రజలకు కుష్టు వ్యాధిపై అపోహలను తొలగించి, వ్యాధి నివారణపై అవగాహన కల్పించింది. ఈ క్రమంలో అనుమానం ఉన్న వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు సైతం నిర్వహించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో కుష్టువ్యాధి నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటుందో ఎయిడ్స్ అండ్ లెప్రసీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ మాటల్లో ..

ప్రశ్న. స్పర్శ కార్యక్రమం నిర్వహణ ముఖ్య ఉద్దేశం ఏమిటీ.. ఈ కార్యక్రమంలో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు..?

జవాబు. ప్రతీ సంవత్సరం మహాత్మా గాంధీ వర్ధంతి రోజును పురస్కరించుకొని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నిర్మూలన దినోత్సవ కార్యక్రమాలు (స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమాలు) నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ కార్యక్రమం ముఖ్య ఆలోచన కుష్టు వ్యాధిని పూర్తి స్థాయిలో నివారించి భవిష్యత్తు తరాలకు లెప్రసీ రహిత సమాజ నిర్మాణమే. పట్టణ ప్రాంతాల్లో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లల్లో పనిచేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది తమ పరిధిలోని ప్రాంతాలకు వెళ్లి లెప్రసీ వ్యాధిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం, అనుమానితులు ఎవరైనా ఉంటే గుర్తించి పరీక్షలు చేసి వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడుకోవాల్సిన మందులు అందజేస్తున్నాం.

ప్రశ్న. లెప్రసీ వ్యాధి లక్షణాలు ఏమిటీ.. ఎలా వ్యాపిస్తుంది.. చికిత్స విధానాలు అందుబాటులో ఉన్నాయా..?

జవాబు. శరీరంపై పోలిపోయిన, రాగి రంగులో మచ్చలు ఏర్పడినా.. ఆ మచ్చలపై స్పర్శ లేక నొప్పి లేకపోయినా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. శరీరంలో ముఖ్యంగా పాదాలు, చేతులు, వేళ్ల తిమ్మెరలు పెడుతున్నా, చర్మం దళసరిగా మారిపోతున్నా ముఖ్యంగా ముఖం నూనె రాసినట్లు నిగనిగలాడుతూ కనిపిస్తే కుష్టు వ్యాధి లక్షణాలుగా భావించి వెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి. లెప్రసీ వ్యాధి వల్ల శరీరం అంతా పుండ్లుతో నిండిపోతుంది. ఇది చర్మానికి, నాడీ వ్యవస్థకు సంబంధించిన దీర్ఘకాలిక వ్యాధి. మ్యూకస్ పొరను ప్రభావితం చేస్తుంది. క్షయ కారకమైన మైక్రో బ్యాక్టీరియాకు చాలా దగ్గర సంబంధం ఉంటుంది. ఈ బ్యాక్టీరియా పేరు మైక్రో బ్యాక్టీరియం లెప్రసీగా పిలుస్తారు. ముఖ్యంగా చాతీ, పొట్టపైన పొక్కులు లేవడం కనిపిస్తుంది. కుష్టు వ్యాధి ఇతర అంటువ్యాధుల వలే ఒక సూక్ష్మక్రిమి వల్ల వస్తుంది. 1873 సంవత్సరం హాన్‌సన్ అను నార్వే శాస్త్రవేత్త ఈ వ్యాధికి కారణమైన జీవిని సూక్ష్మదర్శనిలో గుర్తించాడు. ఈ వ్యాధి వ్యాధిగ్రస్తుని నుండి గాలి ద్వారా, సన్నిహిత సంబంధాల ద్వారా ఇతరులకు సులువుగా వ్యాప్తి చెందుతుంది.

ప్రశ్న. ఈ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటీ, ఎన్ని రోజుల్లో లెప్రసీ వ్యాధి నయం అవుతుంది..?

జవాబు. ఎవరైనా కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించినా.. అనుమానం వచ్చినా వెంటనే సమీపంలోని కుష్టు వ్యాధి నిర్మూలనా కేంద్రానికి వెళ్లి పరీక్షలు నిర్వహించుకోవాలి. వ్యాధి తీవ్రతను బట్టి 6 నెలల నుంచి 12 నెలల వరకు మందులు మింగాల్సి ఉంటుంది. ఈ వ్యాధికి గురైన వారు సమాచారాన్ని దాచడం వల్ల పక్కవారికి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఎట్టి పరిస్థితుల్లో వైద్యుడి వద్దకు వెళ్లి పరీక్షలు చేసుకోవాలి. ఈ వ్యాధి నివారణకు బహుళ ఔషధ (మల్టీ డ్రగ్) చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఈ చికిత్స ఎంతో నమ్మకమైనది. ఈ వ్యాధి ఏదశలో ఉన్నప్పటికీ ఈ మందులు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల అంగవైకల్యాన్ని జయించ వచ్చు. కుష్టు వ్యాధి సోకిన వ్యక్తికి ఒకటి నుంచి ఐదు మచ్చలు ఉంటే వారిని పాసీ బ్యాసిల్లరీ(పీబీ)గా గుర్తిస్తారు. వారికి ఆరు నెలలు చికిత్స ఉంటుంది. కనీసం 9 నెలల్లో కోర్సును పూర్తి చేయాల్సి ఉంటుంది. ఐదు మచ్చలు కంటే ఎక్కువ మచ్చలు ఉంటే వారిని మల్టీ బ్యాసిల్లరీ (ఎంబి)గా గుర్తిస్తారు. వారికి 12 నెలలు చికిత్స ఉంటుంది. కనీసం 15 నెలల్లో కోర్సును పూర్తి చేయాలి. బహుళ ఔషధ చికిత్సతో కుష్టు వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. దాదాపు రూ.15 వేలు నుంచి రూ.20వేలు వరకు ఖర్చయ్యే మందులను పూర్తిగా ఉచితంగా వ్యాధి గ్రస్తులకు అందిస్తారు. 6నెలలు నుంచి 12 నెలల వరకు చికిత్స తీసుకుంటే కుష్టు వ్యాధి పూర్తిగా నయం అవుతుంది.



మంత్రిని ఆహ్వానిస్తున్న నాయకులు

మంత్రికి ఆహ్వానం

ప్రజాశక్తి-బిట్రగుంట


బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామి పాలెంలో వెలసి ఉన్న శ్రీ విఘ్నేశ్వర రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ధ్వజస్తంభం, నవగ్రహాల ప్రతిష్ట కార్యక్రమానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాలవీరాంజనేయ స్వామిని ఆదివారం ఆలయ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర ఆహ్వాన పత్రికను మంత్రి నియోజకవర్గమైన కొండేపి గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి మంత్రితో పాటు ఎంఎల్‌ఎ దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డిని ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు.



జర్నలిస్ట్ అనిల్‌కు నివాళులు

ప్రజాశక్తి-కావలి

కావలిలో జర్నలిస్ట్‌గా పనిచేస్తూ గుండె పోటుతో మృతి చెందిన అనిల్‌కు ఎంఎల్‌ఎ దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదివారం నివాళులు అర్పించారు. కావలి రూరల్ మండలం రుద్రకోట లోని వారి నివాసానికి వెళ్లి, అనిల్ మృత దేహాన్ని దర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ కంభం విజయరామిరెడ్డి

ఎపిఎన్‌జిఒ అధ్యక్షుడిని కలిసిన 'కంభం'

ప్రజాశక్తి-కలిగిరి

వింజమూరు తాలూకా (కలిగిరి, కొండాపురం, వింజమూరు) (ఎపి గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్) అధ్యక్షులు వెలుగోటి మధును ఉదయగిరి మాజీ ఎంఎల్‌ఎ కంభం విజయరామిరెడ్డి దంపతులు ఆయన నివాసంలో మర్యాద పూర్వంగా కలిశారు. అనంతరం వెలుగోటి మధు దంపతులు వారిని మర్యాదపూర్వంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. వీరి భేటీలో 3 మండలాల ఉద్యోగుల సమస్యలు, సచివాలయ వ్యవస్థ ప్రక్షాళన, ఉద్యోగుల బదిలీలు, వింజమూరులో రాజకీయ అంశాలు చర్చించారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూటమి గెలుపునకు ఎంతో కృషి చేశామని, గవర్నమెంట్ వారు స్థానిక ఎంఎల్‌ఎ దానిని గుర్తించి, గవర్నమెంట్ ఉద్యోగుల విషయాలలో వింజమూరు తాలూకాకు సంబంధించి అసోసియేషన్‌కు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

రేకుల షెడ్డు ఏర్పాటు

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని సోమశిల పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతంలో స్థానిక ఎస్ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో విశాలమైన రేకుల షెడ్డును ఏర్పాటు చేశారు. ఈ రేకుల షెడ్డులో పోలీస్ వాహనాలు, ఇతర వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. రేకుల షెడ్డు ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి - వరికుంటపాడు

మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం సోమవారం నుంచి బుధవారం వరకు జరగనున్నట్లు ఎంపిడిఒ తోట వెంకట కృష్ణకుమారి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఉదయం 9.30గంటలకు శిక్షణ కార్యక్రమానికి హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆమె సూచించారు.



ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ప్రజాశక్తి-కోవూరు


వివిధ రంగాలలో పని చేస్తున్న ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలని నెల్లూరు సుధీర్ హాస్పిటల్ గోల్డ్ మెడలిస్ట్ కలిగిన వైద్యులు డాక్టర్ ధీరజ్ అన్నారు. కోవూరు చౌదరి బ్రదర్స్ సురేష్‌కుమార్, రవి కుమార్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఆరోగ్యంపై జాగ్రత్త లేకపోతే కాలక్రమేణా ఆరోగ్యం క్షీణించి పోతుందన్నారు. అనంతరం వైద్య పరీక్షలకు సహకరించ కుండా పోతుందన్నారు. డాక్టర్ నాగమాణిక్యం మాట్లాడుతూ ముఖ్యంగా మహిళల్లో సమస్యలు అధికంగా వస్తుంటాయని వాటిని అలసత్వం చేయరాదన్నారు. ఆర్థోఫెడిక్ డాక్టర్ గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ వయోభారంతోనే కాకుండా కాలానుకగుణంగా మోకాళ్ల నొప్పులు తదితర వ్యాధులకు చికిత్స చేయడం జరుగుతుందన్నారు.

ఎన్‌డిఎ పాలనలో దేశానికి ముప్పు

- గడ్డం కోటారెడ్డి 50వ వర్థంతి సభలో వక్తలు

ప్రజాశక్తి-కావలి

దేశంలో నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో 3వ సారి అతి తక్కువ సీట్లతో కేంద్రంలో గద్దెనెక్కిన ఎన్.డి.ఎ. పాలనలో ఫాసిజం కోరలు చాస్తూ పెరిగిపోతుందని, తద్వారా ప్రమాదం పొంచి ఉందని వీక్షణం పత్రిక ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని పాతూరులో దొడ్లవారి స్థలంలో నిర్వహించిన గడ్డం కోటారెడ్డి 50వ వర్థంతి సందర్భంగా జరిగిన "గడ్డం కోటారెడ్డి" స్మారక సభలో ఆయన ఉద్వేగభరితమైన ఉపన్యాసం చేశారు. కాళోజీ నారాయణరావు చెప్పినట్లు "తమ అభిప్రాయాలను ఏకీభవించని వారిని అణగదొక్కడమే ఫాసిజం" అన్నట్లుగా 370 అధికరణాన్ని రద్దు చేసిన కశ్మీర్‌లో బిజెపిపై రూ.2లక్షల మెజారిటీతో గెలిచిన ఇంజినీర్ రషీద్, పంజాబ్‌లో రూ.2లక్షల ఓట్ల మెజారిటీతో గెలిచిన అమృతపాల్ సింగ్, బిజెపికి వ్యతిరేకంగా ఢిల్లీ సింహాసనాన్ని అధిష్టించిన కేజ్రీవాల్‌లను జైల్లో పెట్టి ఉండడాన్ని చూస్తే ఫాసిజం అనక మరేమంటారని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో 303 లోకసభ సీట్లు ఉండి, మళ్లీ ఎన్నికల్లో 240 సీట్లు మాత్రమే గెలిచినా, బిజెపి కొత్త ప్రభుత్వంలో కూడా అదే మంత్రి వర్గాన్ని కొనసాగించడం, ఆనవాయితీగా వస్తున్న లోక్‌సభ ప్రోటీం స్పీకర్ విషయంలోనూ, ప్రతిపక్షాలకు డిప్యూటీ స్పీకర్ ఇవ్వాల్సిన విషయంలో కూడా నిబంధనలు, ఆనవాయితీలు పాటించకుండా మొండిగా అన్ని బిజెపి సభ్యులకే ఇవ్వడం చూస్తే ఎన్.డి.ఎ. నియంతృత్వం, ఫాసిజం ఎంతగా ఉందో అర్థం అవుతుందని తెలిపారు. తన అధికార బలంతో ప్రతి వ్యవస్థల్లోనూ ఆర్.ఎస్.ఎస్. మనుషులతో నింపివేస్తూ, న్యాయ, రక్షణ వ్యవస్థలను, తన తన కనుసన్నల్లో నడుపుతున్న బిజెపి ఫాసిస్టు పరిపాలనలో దేశంలో ప్రజాస్వామ్యం ఎలా బతికిబట్ట కడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో నేరస్థులు ఎన్నికవుతూ ప్రజాస్వామ్య ప్రక్రియను అపహాస్యం చేస్తున్నారని మరోవక్త విరసం సభ్యులు సి.ఎస్.ఆర్. ప్రసాద్ తన "ప్రజాస్వామ్యం – రూపం – సారం" అంశంలో స్పష్టం చేశారు. "వర్తమాన రాజకీయాలు" అంశంపై మరోవక్త విరసం సభ్యురాలు నల్లూరి రుక్మిణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల భూములను, ఆదివాశీ భూములను అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు అతి తక్కువ ధరకే కట్టబెట్టేందుకు దేశ ప్రజలతో, మనదేశ సైన్యంతోనే దాడులు చేయిస్తుందని ఆరోపించారు. విరసం సభ్యులు ఉన్నం చెంచయ్య అధ్యక్షతన జరిగిన ఈ సంస్మరణ సభలో ఆయన గడ్డం కోటారెడ్డి కుటుంబ సభ్యులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన గడ్డం కోటారెడ్డి జీవిత విశేషాలను తెలియజేశారు. ఈ సభలో ప్రజాకళా నాట్యమండలి, అరుణోదయ నాట్యమండలి కళాకారులు విప్లవ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.శ్రీరాములు, టిడిపి నాయకులు షేక్.మస్తాన్, అడ్వకేట్ పొట్లూరు శ్రీనివాసులు, గడ్డంక్రిష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్

మాజీ సైనికులకు ఉచిత రక్త పరీక్షలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : దేశ రక్షణ కోసం ప్రాణాలు సైతం అడ్డుపెట్టి దేశాన్ని ప్రజలను కాపాడేందుకు సైనికులుగా సేవలందిస్తున్న వారికి, మాజీ సైనికులకు తమవంతు సహకారంగా ఉచిత రక్తపరీక్షలు నిర్వహించనున్నట్లు ఆత్మకూరు మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్.సంధాని తెలిపారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఉదయం 6 గంటలకు ఆత్మకూరులోనే తమ అపోలో క్లినికల్ లేబొరేటరీ వద్ద ఉచిత పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను విశ్రాంత ఆర్మీ ఉద్యోగి నాగేశ్వరరావు ఆవిష్కరిస్తారని తెలిపారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ జరుపుకోనున్నట్లు తెలిపారు. ఎందరో అమరవీరుల ప్రాణత్యాగాల ఫలితమే స్వాతంత్ర్యం అని దేశ రక్షణలో సైనికులు పాత్ర మరువలేనిదన్నారు. సుగర్ పరీక్షలు, గుండె పరీక్షలు, కిడ్నీ పరీక్షలు, కంప్లీట్ బ్లడ్ కౌంట్ మొదలగు రక్త పరీక్షలను ఉచితంగా సైనికులకు మాజీ సైనికులకు చేస్తామని తెలిపారు. సైనికులు మాజీ సైనికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

రాయితీతో గోకులం షెడ్లు మంజూరు

ప్రజాశక్తి-ఉదయగిరి

రాష్ట్ర ప్రభుత్వం 90శాతం రాయితీతో పాడి పశువుల గోకులం షెడ్లు మంజూరు చేసిందని ప్రాంతీయ పశువైద్యశాల సిబ్బంది ఆదివారం పత్రికా ప్రకటన ఒకటి విడుదల చేశారు. ఆ ప్రకటనలో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 90శాతం రాయితీతో పాడి పశువుల గోకులం షెడ్లు మంజూరు చేసిందన్నారు. పాడి రైతులకు 90శాతం రాయితీతో మినీగోకులం షెడ్లు మంజూరు చేయబడ్డాయని పశువులు షెడ్లు నిర్మించుకునే రైతులకు రెండు పశువులకు రూ.1,15,000 రైతు వాటా రూ.11,500 అని, నాలుగు పశువులకు రూ.1,85,000 రైతు వాటా రూ.18,500 అని, ఆరు పశువులకు రూ.2,30,000 రైతు వాటా రూ.23,000 అని వివరించారు. 90 శాతం సబ్సిడీ ఉపాధి హామీ నిధుల నుండి మంజూరు చేస్తారు. గోకులం షెడ్లు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, జాబ్ కార్డు, ఉపాధి హామీ కార్డు, స్థలం డాక్యుమెంటు, బ్యాంకు పాస్‌బుక్ ఇవన్నీ తీసుకుని స్థానిక రైతుసేవా కేంద్రాలు గానీ, పశువైద్యశాలను గానీ సంప్రదిస్తే వాళ్ల దరఖాస్తు పూర్తి చేసి మండల కేంద్రానికి పంపుతారు. రైతులు ఎస్‌సి, ఎస్‌టి ఇతర బిపిఎల్ ఫ్యామిలీస్ చిన్న సన్నకారు రైతులు అందరూ అర్హులు అవుతారు. గొర్రెల షెడ్లు, కోళ్ల షెడ్లు నిర్మించుకునే రైతులకు 70శాతం సబ్సిడీతో షెడ్లు మంజూరు చేస్తారు. 20 గొర్రెలకు



రూ.1,30,000 రైతు వాటా రూ.39,000 అని, 50 గొర్రెలకు రూ.2,30,000 రైతువాటా రూ.69,000 అని, రూ.87,000 రైతువాటా రూ.26,100 అని, రూ.1,32,000 రైతువాటా రూ.39,600 అని వివరించారు. ఆసక్తి ఉన్న రైతులకు అన్ని అర్హతలు ఉంటే షెడ్లు మంజూరు చేస్తారు. అందరికీ ఉపాధి హామీ జాబ్ కార్డు ఉండాలి. ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు.

నిత్యావసరాలు వితరణ

ప్రజాశక్తి-కావలి

తుఫాన్ నగర్లోని సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో ఆ సంస్థ సంరక్షణలో ఉన్న పిల్లలకు నిత్యావసర వస్తువులు, బియ్యం, ప్రతి నెలా పోస్టాఫీసులో నగదు జమ చేస్తున్న పాస్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో అతిథులుగా సంస్థ సభ్యులు మాజీ కౌన్సిలర్ గంధం ప్రసన్నాంజనేయులు, ప్రధానోపాధ్యాయులు నేలటూరి శివప్రసాద్ రెడ్డి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంయుక్త సేవా సంస్థ ద్వారా పేద పిల్లలను సంరక్షించడం అభినందనీయమన్నారు. సంయుక్త సంరక్షణలో ఉన్న పిల్లలు ఎంతో ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. పిల్లలను దత్తత తీసుకొని సహాయం అందజేస్తున్న దాతలను అభినందించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ పేద పిల్లల్ని సంరక్షిస్తున్న దాతలు డాక్టర్ బి రాజేంద్ర ప్రసాద్ – రాధ దంపతులకు, బెజవాడ.ప్రకాష్ – శకుంతలమ్మ దంపతులకు, సామ్ సదాప్స్ – అముద సదాప్స్ దంపతులకు, డాక్టర్ బి సతీష్ – డాక్టర్ పి.ఉషారాణి దంపతులకు, డాక్టర్ కె ఆనంద్ కుమార్ – డాక్టర్ టి మాధవీలత దంపతులకు, డాక్టర్ పి పద్మజకు, డాక్టర్ పార్థసారథి రాజు –డాక్టర్ ఉషారాణి దంపతులకు, డాక్టర్ జాహ్నవికి, డాక్టర్ పి శ్రీధర్ – డాక్టర్ కె ఝాన్సీ దంపతులకు, ఎమ్.నితిన్ కుమార్ – నిఖిల దంపతులకు, కూచిపూడి నృత్య గురువు గంగపట్నం లిఖితకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు.



నిత్యావసరాలు వితరణ దాతలు

సిఎంకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-అనంతసాగరం : సిఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు మండల సర్పంచుల అధ్యక్షులు బిజివేముల ఓబుల్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల రూపు రేఖలు మారిపోయాయని స్థానిక పాలన స్వర్ణయుగంగా తలపిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ కాబట్టి ఆగస్టు 15 వేడుకలకు గ్రామ పంచాయతీల్లో గ్రాంట్‌లో గతంలో రూ.100 ఖర్చు చేసేవారని ప్రస్తుతం రూ.10వేలు పెంచడం హర్షించదగ్గ విషయమన్నారు.